క్లుప్తంగా

గణపురం ఎస్సైగా సాంబమూర్తి



గణపురం: నూతన ఎస్సైగా మచ్చ సాంబమూర్తిని నియమించినట్లు మల్టీ జోన్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ పోలీస్ కాళేశ్వరం, రామగుండం అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్‌బీ విభాగంలో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన మ్యాక అభినవ్‌ను కాటారం ఎస్సైగా బదిలీ అయ్యారు.

భూపాలపల్లి ఎస్సైగా శ్రావణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై-1గా శ్రావణ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ బుధవారం కాళేశ్వరం మల్టీజోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రావణ్‌కుమార్‌ను ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో అటాచ్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని ఆజాంనగర్‌లో చోటు చేసుకొంది. బియ్యాల మోహన్‌కు చెందిన పాడి గేదె బుధవారం గ్రామ శివారులోకి మేతకు వెళ్లింది. గ్రామంలోని ఎర్రగడ్డ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ గేదెకు తాకడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

పంబాపూర్‌లో మేక..

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన సంఘటన మండలంలోని పంబాపూర్‌లో జరిగింది. అరిగ చిన్న వీరయ్యకు చెందిన మేక ముదిరాజ్ కార్యాలయం సమీపంలో ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారుగా రూ. 12వేలు నష్టం జరిగినట్లు తెలిపారు.

వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం

మల్హర్: వారం రోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాడిచర్ల-ఖమ్మంపల్లి, అడవి సోమన్‌పల్లి జిల్లా సరిహద్దు మానేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇంకా వర్షాల కురిస్తే వాగు మరింత ఉధృతి పెరిగి సమీపంలోని పంట పొలాలకు భారీగా వరద నీరు చేరడంతో పాటు మానేరు సమీపంలోని కొయ్యూరు పీవీనగర్, వల్లెకుంట, కుంభంపల్లి గ్రామాల్లోని ఇళ్లకు నీరు చేరుకునే ప్రమాదం ఉంది. భారీ వర్షాలతో అన్సాన్‌పల్లిలోని బూడిది సమ్మయ్య, బూడిది స్వామి ఇంటి ఎదుట వరద నీరు చేరింది. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది.

రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు



మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి వాగు సమీపంలో బుధవారం రాత్రి జాతీయ రాహదారిపై గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడంది. వెంటనే స్పందించిన ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి రంపంతో కట్ చేయించి రోడ్డు ప్రక్కన వేసి రాకపోకలు కొనసాగించారు.

వరద నీరు తొలగింపు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కేపురం గ్రామపంచాయతీలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు ఇళ్ల మధ్యలోకి చేరుకొని రహదారి సౌకర్యం లేకుండా పోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ పూనెం శ్రీదేవి, జెడ్పీటీసీ పాయం రమణ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన వారు జేసీబీ సాయంతో వరద నీటిని తొలగించారు. బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి డర్రె దామోదర్, తదితరులు ఉన్నారు.

వర్ష బీభత్సంతో ఇళ్లు నేలమట్టం

టేకుమట్ల: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండుకుని నిండుకుండలా దర్శనమిస్తూ అలుగులు పోస్తున్నాయి. చలివాగు, మానేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ కొన్ని చోట్ల లోలెవల్ కల్వర్టుల వద్ద రవాణా స్తంభించిపోయింది. మండలంలోని రాఘవరెడ్డిపేటలో కర్నె వీరమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది.

రేగొండలో..

రేగొండలో వరుస వర్షాలకు మండల కేంద్రానికి చెందిన మాడ రమ, మంతెన సరస్వతి, సామల అమ్మక్క, బండి పోశయ్యలకు చెందిన ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఇండ్లు కూలిన బాధితులను రేగొండ సర్పంచ్ ఏడునూతుల నిశీధర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శి తుల్జారాణితో కలిసి పరిశీలించారు.

పలిమెల : మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం మండలంలోని దమ్మూరు గ్రామపరిధిలోని బూరుగ్గుడెం చెందిన మట్టి బాపు ఇంటి ఒక పక్క గోడ కూలిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి బుధవారం కూలిన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి సంబంధించిన కూలిన ఇంటి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

రోడ్డుపై నడవాలంటే నరకయాతనే

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల ప్రధానరహదారి వారం రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పలుగుల, కుంట్లం గ్రామాల నుంచి నిత్యం అవసరాల కోసం కాళేశ్వరం రావల్సి ఉంటుంది. రాత్రివేళల్లో ఆ గుంతలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.



టేకుమట్ల : రేగొండలో కూలిపోయిన ఇళ్లు



రాఘవరెడ్డిపేటలో...



కాళేశ్వరం : గుంతలతో దర్శనమిస్తున్న రోడ్డు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కోటంచలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న ఆలయ అధికారులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతీ నెలలో వచ్చే స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం సందర్భంగా బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకంతో ప్రారంభమై, సుదర్శన నారసింహహోమాన్ని కొనసాగించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆరగింపుతో కల్యాణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితకర్ణాకర్‌రెడ్డి, సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, ఆలయ డైరెక్టర్లు పోగు సుమన్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

చిట్యాల : మండలంలోని గోపాలపూర్‌లో మహిళా కాంగ్రెస్ కమిటీని మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మహిళా అధ్యక్షురాలు మేరుగు లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఏకు సుగుణ, ఉపాధ్యక్షురాలిగా తీర్థాల విజయ, అజ్మీరా సుగుణ, నీలం స్వరూప, కటకం అమరావతి, ప్రధాన కార్యదర్శిగా రాయకుల స్వప్న, కార్యదర్శులుగా సులోచన, కవిత, లావణ్య, జయ, సౌందర్య, కోశాధికారిగా తీర్థాల ఆదిలక్ష్మితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

మత్స్యకారుల చేపల వేట

మహాముత్తారం: గత నాలుగు రోజులుగా కురుస్తు అకాల వర్షానికి మండలంలోలోని వివిధ గ్రామాల్లో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. స్థానిక బొర్రవాగు వద్ద మత్స్యకారులు వలలతో చేపల వేట కొనసాగించారు. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరాలో బంధించింది.



వలలు వేస్తున్న మత్స్యకారులు

21వ రోజుకు చేరుకున్న జీపీ కార్మికుల సమ్మె

మొగుళ్లపల్లి: పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చేస్తున్న సమ్మె బుధవారం 21వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో క్యాతరాజు రాజయ్య, అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం,శ్రీరాం క్రిష్టయ్య, చేలిక సురేష్, పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి : వర్షంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

కాటారం: గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 6 నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారి కంపుకొడుతున్నాయని పేర్కొన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు 11వ పీఆర్‌సీ ప్రకారం పెరిగిన జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బెనిఫిట్స్ వర్తింపజేయాలని కోరారు.

పోలీసుల వాహన తనిఖీలు



మల్హర్ : వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్



మహాముత్తారం : తనిఖీ చేస్తున్న ఎస్సై

మల్హర్ : ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో భూపాలపల్లి-పెద్దపల్లి సరిహద్దు ప్రాంతంలో కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మంథని-కాటారం వైపు వెళ్తున్న వాహనాలు ఆపి, వాహన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. నింబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు జరిమానా విధించారు. అలాగే సరిహద్దుల్లో కూంబింగ్ నిర్వహించి, ప్రధాన కల్వర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి ప్రధానకూడలిలో బుధవారం ఎస్సై సుధాకర్ వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనదారులతో మాట్లాడి పత్రాలను పరిశీలించారు. అనంతరం అనుమానితులతో మాట్లాడి వదిలేశారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

వాజేడు : మండలంలో మంగళవారం రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో తెల్ల వారు జామున 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం తాగు నీటి కోసం ఎదురు చూసిన ప్రజలకు విద్యుత్ లేని కారణంగా మంచినీరు రాలేదు. ఒక వైపు వర్షం మరో వైపు తాగునీరు లేక తీవ్రఅవస్థలు ఎదుర్కొన్నారు. వెంకటాపురం(కె)లోని 132 కేవీకి సంబంధించిన విద్యుత్ కేంద్రంలో ట్రిఫ్ కాయల్ పోవడం, వాజేడుకు వచ్చి 33/11 కేవీ లైన్లో ఇన్సులేటర్ పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు మరమ్మతు పనులను చేసి సాయంత్రం 5 గంటలకు వెంకటాపురం(కె)లోని 33/11 కేవీ నుంచి విద్యుత్‌ను వాజేడుకు ఇచ్చారు.

చేయూత



ములుగు రూరల్ : భారీ వర్షాలకు ఇళ్లు ధ్వంసమైన కుటుంబాలకు తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో ఈక లక్ష్మికి చెందిన ఇళ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో సంస్థ పాలక మండలి సభ్యు డు ప్రసాద్‌రావు టార్పాలిన్ అందించారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు లావుడ్య వాగ్యా, సర్పంచ్ స్వాతి, రజినీ, సాంబయ్య, సమ్మయ్య, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ములుగులో పొంగుతున్న వాగులు



వెంకటాపురం(కె) : ఉధృతంగా ప్రవహిస్తున్న కంకలవాగు

వెంకటాపురం(కె): మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు వాగుల్లోకి చేరి వాగులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని కంకలవాగు, రాచపల్లి వాగులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వాగులు పొంగుతుండటంతో కొందరు వలతో చేపల వేట కొనసాగించారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల

ములుగు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల చెరువును తలపిస్తోంది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో భారీగా నీరు నిలిచిపోయింది. నీరు బయటికి వెళ్లడానికి డ్రెయినేజీ సిస్టం సరిగాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమస్యలపై గతంలో చాలాసార్లు విన్నవించుకున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని తెలుస్తుంది. ఇదిలా ఉండగా పాఠశాలలోని మరుగుదొడ్లకు వెళ్లే దారి సైతం నీటిమయంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు బహిరంగ ప్రాంతాల్లోనే మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి దాపురించింది. విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భూపతిపురం రోడ్డుకు గండి

కన్నాయిగూడెం: మండలంలోని భూపతిపురం ప్రధాన రహదారి కల్వర్టు వద్ద గండి పడింది. వారం రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలతో గ్రామంలో ఉన్న చెరువులోకి నీరు చేరడంతో చెరువు మత్తడి పడి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వరద నీరు ఒక్కసారిగా రావడంతో కల్వర్టు వద్ద గండి పడింది. వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ములుగు : చెరువును తలపిస్తున్న పాఠశాల



కన్నాయిగూడెం : కల్వర్టు వద్ద ఏర్పడిన గండి

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరించవద్దని స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం కిష్టరావుపేటలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు బానిస కాకుండా కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని ఇందుకు కఠిన చర్యలు ఉంటామని హెచ్చరించారు. మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, గ్రామంలోకి అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో గుడుంబా, గంజాయి, నాటుసారా వంటి నిషేధిత వస్తువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

జగ్గన్నగూడేన్ని నూతన జీపీగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఈక సాగర్

ములుగు రూరల్: మండలంలోని సర్వాపూర్ పంచాయతీ పరిధిలోని జగ్గన్నగూడేన్ని జీపీగా గుర్తించాలని గ్రామపంచాయతీ సాధన సమితి అధ్యక్షుడు ఈక సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి సర్వాపూర్ సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉండగా 600 మంది జనాభా కలిగి ఉన్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన గ్రామమని, పంచాయతీగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈక కుమార్, సాంబయ్య, లక్ష్మీనర్సయ్య, సమ్మక్క, రేణుక, సమ్మయ్య, శ్రీకాంత్, లింగస్వామి, పాల్గొన్నారు.

‘సీతక్కపై ఆరోపణలు చేయడం సరికాదు’

కన్నాయిగూడెం: నిత్యం ప్రజల మధ్య ఉంటు ప్రజాసమస్యలపై పోరాడుతున్న ఎమ్మెల్యే సీతక్కపై విమర్శలు చేయడం సరికాదని ములుగు జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సునార్కని సాంబశివరావు అన్నారు. మూడు రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామానికి వెళ్లి గ్రామంలోని నిరుపేదలను పరామర్శించి వస్తున్న క్రమంలో తన వాహనం బురదలో కూరుకుపోయింది. దీనిని అభిమానులు తీస్తున్న దృశ్యాన్ని సెల్‌ఫోన్ ద్వారా బంధించి యూ టూబ్ ద్వారా వైరల్ చేసి ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం తగదన్నారు. నిత్యం సీతక్క ప్రజల కోసం పనిచేస్తున్న వ్యక్తి అని తెలిపారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



వరద పరిస్థితులను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని గోదావరి వరద ముంపు ప్రాంతాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి అరవిందరెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులు బొదాపురం, పాత్రాపురం, కుక్కతోగు వాగు ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో కురుస్తున్న బారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లడంతో పాటు, గోదావరి వరద ఉధృతి పెరగటంతో వరద పరిస్థితులను సందర్శించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కన్నాయిగూడెం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అభినవ్ అన్నారు. మండలంలోని సర్వాయి పరిధిలోని పాలాయిగూడెంలో స్థానిక వైద్యులు అభినవ్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 23 మందికి ఓపీ చూడగా అందులో ఎనిమిది మందికి ఆర్‌డీటీ పరీక్షలు చేయగా నలుగురికి జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ దోమల వ్యాప్తి జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఓం ప్రకాష్, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జెల్లాకాలనీ, నేలారిపేట, ముకునూరు పాలెం, తుర్సవానిగూడెం గ్రామాల్లో వైద్య సి బ్బంది శిబిరాలను నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రా మంలోని ప్రతి ఇంటికి వెళ్లి జ్వర పీడితులపై సర్వే నిర్వహించారు. వెద్య సిబ్బంది పాల్గొన్నారు.



కన్నాయిగూడెం : వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ అభినవ్